# భవనాలు పూర్తయ్యేనా?

- భవనాల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులు
- కోట్లాది రూపాయలు విడుదల
- కూటమి ప్రభుత్వ పాలనలో అసంపూర్తిగా దర్శనమిస్తున్న పనులు
- వెంటాడుతున్న వసతి సమస్య
- పట్టించుకోని అధికారులు


అసంపూర్తిగా ఉన్న వైద్యుల వసతి గృహాలు


అసంపూర్తిగా దర్శనమిస్తున్న కలెక్టర్ క్యాంపు కార్యాలయ భవనం


పిల్లర్ల దశలో నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం పనులు

**చింతపల్లి:** గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన కోట్లాది రూపాయలతో నిర్మించిన భవనాలు నేటికీ పూర్తి కాక అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలకు సేవలు అందడం లేదు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఉద్యోగులు వసతి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో చింతపల్లి ఆస్పత్రి వైద్యుల సౌకర్యార్థం వసతి గృహాలు నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. దీంతో డైరీ ఫారంకి సంబంధించిన స్థానిక గిరిజన బాలురు ఆశ్రమ పాఠశాల సమీపంలో భవన నిర్మాణం ప్రారంభించారు. మూడంతస్తుల భవనాన్ని పూర్తి చేయకుండా అసంపూర్తిగానే నిలుపుదల చేశారు. చింతపల్లి ఆస్పత్రికి సంబంధించి ప్రస్తుత ఏరియా ఆస్పత్రిలో సుమారు 20 మందికి పైగా వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఈభవన నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు సైతం మండల కేంద్రంలో నివాసం ఉండకుండా మైదాన ప్రాంతం నుంచి రాకపోకలు సాగించే పరిస్థితి నెలకొంది. దీంతో గిరిజనులకు సకాలంలో వైద్య సేవలు అందక నానా అవస్థలు పడుతున్నారు. అదే విధంగా మండల కేంద్రంలోని ఇండోర్ స్టేడియం పనులు సైతం అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. స్టేడియానికి సంబంధించి పిల్లర్ స్థాయిలోనే పనులు నిలిచిపోయాయి. దీంతో క్రీడాకారులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న స్టేడియం కలగా మిగిలిపోతుందని పలువురు చెబుతున్నారు. ఈ నిర్మాణాలను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. ఈ ప్రాంతానికి సంబంధించిన క్రీడాకారులకు ఈ ఆడిటోరియం ప్రారంభమైతే ఆటలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని ఆశించారు. ఈ నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఆశలు నిరాశగానే మిగిలిపోయాయి. అదే విధంగా నూతనంగా జిల్లా ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం కలెక్టర్ క్యాంప్ కార్యాలయానికి ఎస్‌ఈఏ నిధులు రూ.1.10కోట్లను మంజూరు చేసింది. విడుదలైన నిధులతో నిర్మాణ పనులు సరవేగంగా జరిగాయి. అనంతరం ఈ నిర్మాణ పనులు సైతం కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి మూలకు చేరాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవన నిర్మాణాలు పూర్తి చేసే విధంగా తగు చర్యలు చేపట్టాలని స్థానికులు, ఉద్యోగులు కోరుతున్నారు.

### భవనాలు పూర్తి చేయాలి



మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలను పూర్తిగా ఉన్న భవన నిర్మాణాలను చూర్తి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టాలి. వైద్యుల వసతి గృహాలు సంవత్సరాలు తరబడి అసంపూర్తిగా ఉండడంతో వారు నివాసానికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో స్థానికంగా లేకపోవడంతో వైద్య సేవలకు గిరిజనులు దూరమవుతున్నారు. తక్షణమే భవన నిర్మాణాలు పూర్తి చేయాలి.

–బోసర్ కృష్ణారావు, మాజీ వైస్ ఎంపీపీ

### త్వరలో పనులు ప్రారంభిస్తాం



అసంపూర్తిగా ఉన్న కలెక్టర్ క్యాంపు కార్యయాన్ని నెల రోజుల్లో పూర్తి చేస్తాం. ఐటీడీఏ వల్ల రూ.50లక్షల నిధులు మంజూరయ్యాయి. వారం రోజుల్లో పనులు ప్రారంభించి త్వరగా పూర్తి చేయడానికి చర్యలు చేపడుతున్నాం. వైద్యాధికారుల వసతి గృహాలు, ఇండోర్ స్టేడియం నిర్మాణానికి సంబంధించి అనుమతులు రద్దు అయ్యాయి.

– చాణిక్యరావు, డీఈ, గిరిజన సంక్షేమ శాఖ , చింతపల్లి

## 108లో ప్రసవం


శిశువును అందజేస్తున్న 108 సిబ్బంది

**మారేడుమిల్లి :** వై.రామవరం మండలం బొడ్డగుంట గ్రామానికి చెందిన వరలక్ష్మి అనే గర్భిణికి పురిటినొప్పులు రావడంతో బంధువులు 108 అంబులెన్స్‌కి సమాచారం అందించారు. 108 సిబ్బంది అక్కడి చేరుకుని అంబులెన్స్‌లో మారేడుమిల్లి పీహెచ్‌సీకి తరలిస్తుండగా, వరలక్ష్మికి పురిటినొప్పులు ఎక్కువడంతో మార్గం మధ్యలో ఈఎంటీ ఎం.సుజాత, పైలెట్ ఎం.శంకరావు ఆమెకు పురుడు పోశారు. మగ బిడ్డకు జన్మనిచ్చిందని, తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని, అనంతరం వారిని మారేడుమిల్లి పీహెచ్‌సీలో జాయిన్ చేసినట్టు 108 సిబ్బంది తెలిపారు.

## జీసీసీ గొడౌన్ వాచ్‌మన్ అనుమానాస్పద మృతి

**నర్సీపట్నం:** పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం వెనుక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా కరెంటు స్తంభానికి వాచ్‌మన్ ఉరేసుకుని మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై ఉమామహేశ్వరరావు సిబ్బందితో వెళ్లి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. నర్సీపట్నానికి చెందిన ఒ.ఉమాపరమేశ్వరరావు పాడేరు ఐటీడీఏ పరిధి డొనూరు జీసీసీ గొడౌన్‌లో పదేళ్లుగా వాచ్‌మన్ పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి తన ఇంటి నుంచి వెళ్లి ఆదివారం ఉదయం విద్యుత్ స్తంభానికి తాడుతో ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. మృతికి కారణాలు తెలియరాలేదు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## క్లుప్తంగా

### వైఎస్సార్ వర్ధంతి నేడు


వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాట్లు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**ముంచంగిపుట్టు:** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని సోమవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు వైఎస్సార్‌సీపీ మండల నేతలు రాంప్రసాద్, తిరుపతి, రాజారావు, రామ్మూర్తిలు తెలిపారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి రంగులు వేస్తూ, పరిసరాలు శుభ్రం చేశారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్ వర్ధంతికి సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

**గంగవరం:** నెల్లిపూడిలో మహానేత వైఎస్సార్ వర్ధంతిని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్నట్టు మండల పార్టీ ఇన్‌చార్జి సీహెచ్ రాఘునాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారని తెలిపారు. నెల్లిపూడిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద జరిగే కార్యక్రమానికి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### బాధిత విద్యార్థులకు రొట్టెలు, పండ్లు పంపిణీ


రొట్టెలు, పండ్లు అందజేస్తున్న మోటార్ యూనియన్ కార్మికులు, వైద్య సిబ్బంది

**అరకులోయ రూరల్:** ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జాముగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల వసతి గృహం విద్యార్థులను అనంతగిరి ,బొర్రా మోటార్ యునియన్ సభ్యులు ఆదివారం సందర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాము సమక్షంలో విద్యార్థులకు రొట్టిలు, పండ్లు అందజేశారు. శ్యామ్‌కుమార్, బాలు, మధు, రామారావు, బాబీ, సుధ, భీమరాజు, వెంకట్, నూకరాజు, చిన్న పాల్గొన్నారు.

### ఫొటోగ్రాఫర్ల నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గం

**చింతపల్లి:** చౌడుపల్లి మార్కెట్ యార్డులో చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాలకు చెందిన ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. ముత్యాలమ్మ ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాసరావు, లీలాప్రసాద్, ఉపాధ్యక్షుడిగా రవిప్రసాద్, కోశాధికారిగా నగేష్, గౌరవ అధ్యక్షుడిగా గోపి, ఉపాధ్యక్షుడిగా సురేష్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గ ప్రతినిధులు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి సంఘం తరపున కృషి చేస్తామన్నారు.

### పొదుపుపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న సత్యనారాయణ

**చింతపల్లి:** నగదు పొదుపుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మాతోట సీఈవో నెల్లూరి సత్యనారాయణ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో మహిళ మాతోట మ్యాక్స్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాబార్డు సహకారంతో గిరిజన వికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రోత్సాహంతో మహిళ మాతోట పరస్పర సహకార పరపతి సంఘం ఏర్పాటు చేశామన్నారు. 300 మంది సభ్యులతో ఈ సంఘం కొయ్యూరు, గూడెం కొత్తవీధి, చింతపల్లి, జి.మాడుగుల మండలాల పరిధిలో ఆరువేల మంది సభ్యులతో ఏడాదికి మూడు కోట్ల రూపాయల లావాదావీలతో కొనసాగుతుందన్నారు. సభ్యులకు రూ.30లక్షల నుంచి రూ.35 లక్షలు రుణాలు అందజేస్తున్నట్టు చెప్పారు. మ్యాక్స్ చైర్‌పర్సన్ శారదమ్మ, మేనేజర్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## కాజ్‌వేకు మరమ్మతు చేయాలి


కోతకు గురైన మర్రిపుట్టు కాజ్‌వేను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబు తదితరులు

**పెదబయలు:** మండలంలోని మర్రిపుట్టు కాజ్‌వే వర్షాలకు కోతకు గురై కొంత భాగం ఆదివారం ఉదయం కూలిపోయిందని త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు డిమాండ్ చేశారు. కోతకు గురైన కాజ్‌వేను వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోమంగి నుంచి బొంగరం వెళ్లిన కొద్ది సేపటికే కోతకు గురైన భాగం కూలిందని, గత నెలతో కురిసిన వర్షాలకు కొంత భాగం దెబ్బతిందని ఈ విషయం ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి పత్రికల్లో, సోషల్ మీడియా ద్వారా తెలియపర్చగా నేరుగా చెప్పినా పట్టించుకోలేదన్నారు. పాడేరు నుంచి బొంగరం వరకు సుమారు 30 పంచాయతీలకు చెందిన వందల గ్రామాల ప్రజలకు ఈ మార్గం మీదుగా ప్రయాణిస్తుంటారన్నారు. కాజ్‌వే కూలడంతో మండలంలోనే సుమారు ఆరు గ్రామ పంచాయతీలకు బస్సు సర్వీసు లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాజ్‌వేకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బాలరాజు, సత్తిబాబు. గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ, రామారావు. విజయ్‌కుమార్, లాలీబాబు, రవికుమార్, భగీరథరావు, తిరుపతిరావు, ప్రవీణ్ పాల్గొన్నారు.

## నిస్వార్థ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు


ఏపీవో శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న పీవో సింహాచలం, అధికారులు

**రంపచోడవరం:** విధి నిర్వహణలో నిస్వార్థ సేవలందించిన ఉద్యోగులకు ఎప్పటికి ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. రంపచోడవరం ఐటీడీఏలో జరిగిన ఏపీవో సీహెచ్.శ్రీనివాసరావు పదవీ విరమణ వేడుకల్లో పీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవో సింహాచలం మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గిరిజనులకు సేవ చేయడంతో ఎంతో కృషి చేశారని తెలిపారు. ఏపీవో దంపతులను ఘనంగా సన్మానించారు.

## అందుబాటులోకి ఆర్‌వో ప్లాంట్


జామిగుడ పాఠశాలలో ఆర్‌వో ప్లాంట్ మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న హెచ్‌ఎం సుజాత

**అరకులోయటౌన్:** డుంబ్రిగుడ మండలం జామిగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న ఆర్‌వో ప్లాంట్‌ను పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదివారం మరమ్మతు పనులు చేయించి అందుబాటులోకి తీసుకువచ్చారు. విద్యార్థినులకు సురక్షితమైన తాగునీరందించాలన్న ఉద్దేశంతో తక్షణమే ఆర్‌వో ప్లాంట్ బాగు చేయించినట్టు పలువురు చెప్పారు. ఐటీడీఏ పీవో శనివారం వసతి గృహాన్ని సందర్శించినప్పుడు ఆర్‌వో ప్లాంట్ పనిచేయక కలుషిత నీటిని సేవించి రోగాల బారిన పడుతున్నట్టు విద్యార్థినులు పీఓ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన పీఓ అభిషేక్ ఆర్‌వో ప్లాంట్ బాగుచేయిస్తానని మాటిచ్చి, మరుసటి రోజే అందుబాటులోకి తీసుకురావడంపై విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థినుల వినియోగానికి, వంటలకు సురక్షితమైన నీటినే వినియోగించాలని, విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, పాఠశాల ఆవరణ, వంట గది, డైనింగ్ హాల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని పాఠశాల హెచ్‌ఎం సుజాతకు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించినట్టు తెలిసింది.

## ముంచెత్తిన వర్షం

- భారీ వర్షాలతో ఉధృతంగా కాలువలు
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు


వరదనీటిలో ఉన్న వరి పంటను చూపిస్తున్న రైతు


ఉధృతంగా ప్రవహిస్తున్న కొయ్యూరు కాలువ


కొయ్యూరులో బోసిపోయిన సంత


చెరకుంపాలెం వద్ద రహదారి మీదుగా ప్రవహిస్తున్న వరదనీరు


నెల్లిపూడి వద్ద కాలువను పరిశీలిస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం


వెలగపల్లి కాలువను పరిశీలిస్తున్న ఏఎస్పీ జగదీష్

**డుంబ్రిగుడ/కొయ్యూరు/రాజవొమ్మంగి:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం వల్ల జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శివారు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు గ్రామాల్లో రహదారులు వరద నీటిలో మునిగి ఉన్నాయి. పొలాలన్నీ నీట మునిగాయి. కూరగాయాలు, ఆకుకూరలు, వాణిజ్య పంటలు ముంపు బారిన పడడంతో గిరిజన రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. వరి పొలాల్లో ఇసుక మేటలు ముంచెత్తాయి. వర్షానికి దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని గిరిజన రైతులు కోరుతున్నారు. కొయ్యూరు మండలంలోని తీగలమెట్టు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పది గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. మండల కేంద్రంలోని వారపు సంత బోసిపోయింది. గిరిజన రైతులు, వ్యాపారులు అంతంత మాత్రంగానే వచ్చారు. వర్షాల వల్ల వినియోగదారులు రాక సంత వెలవెలబోయింది. రాజవొమ్మంగి మండలంలోని చెరకుంపాలెం, మర్రిపాలెం, జడ్డంగి గ్రామాల మీదుగా ఆదివారం కొక్కెరగెడ్డ వాగు ప్రవహించడంతో సుమారు 30 ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగాయి. చెరకుంపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రం చుట్టు వరద నీరు చేరడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. జడ్డంగి, చెరకుంపాలెం గ్రామాల శివార్లలో రహదారి కొట్టుకొని పోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానిక సీఐ సన్యాసినాయుడు, ఎస్‌ఐ వెంకయ్య తమ సిబ్బందితో అక్కడి వెళ్లి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. లబ్బర్తి, ఎర్రంపాడు, రాజవొమ్మంగి శివారు శాంతిన గర్‌ల వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అక్కడ పరిస్థితులను పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. ప్రజలు వాగులు దాటకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు. అప్పలరాజుపేట వద్ద వట్టిగెడ్డ రిజర్వాయర్‌లో ఉధృతంగా వరదనీరు చేరింది. నీటిని దిగువుకు పంపించే ఏర్పాట్లు చేశారు. మడేరు ఆనకట్ట ఉరకలెత్తుతూ ప్రవహిస్తోంది. కాగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. రాజవొమ్మంగిలో ఆదివారం 92.2 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు స్టాటిస్టికల్ అధికారి మురళీకృష్ణ తెలిపారు.

**ఏజెన్సీలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**రంపచోడవరం:** బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావం వల్ల భారీ వర్షాలు కురిసి కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం చెప్పారు. గంగవరం మండలం నెల్లిపూడి, అడ్డతీగల మండలంలోని వట్టిగడ్డ కాలువ, పలుకురాతిపాలెం కాలువలను ఆదివారం పరిశీలించారు. ప్రమాదకరంగా ప్రవాహిస్తున్న కొండవాగుల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొనేందకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు.

**వెలగపల్లి కాలువను పరిశీలించిన ఏఎస్పీ**

దేవీపట్నం మండలం వెలగలపల్లి గ్రామం వద్ద ఉధృతంగా ప్రవాహిస్తున్న కొండకాలువను రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి ఆదివారం పరిశీలించారు. వాగును ఎవరు దాటవద్దని సూచించారు. ఈ రహదారిలో ఎవరు ప్రయాణించకుండా పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

## విద్యార్థినుల పరిస్థితిపై మాజీ మంత్రి బాలరాజు ఆరా


మాజీ మంత్రి బాలరాజు

**అరకులోయటౌన్:** డుంబ్రిగుడ మండలం జామిగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో కలుషిత ఆహారం తిని వాంతులు, కడుపు నొప్పితో బాధపడుతూ అరకులోయ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై మాజీ మంత్రి, వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పసుపులేటి బాలరాజు ఆరా తీశారు. అరకులోయ ఏరియా ఆస్పత్రి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి బాధిత విద్యార్థినులకు అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఆదివారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. గిరిజన ప్రాంతంలోని అన్ని వసతి గృహాల్లో మెనూ ప్రకారంగా భోజనాలు వండి వడ్డించాలని, ఏ పూట భోజనాలు ఆ పూటకే అందజేయాలని డిమాండ్ చేశారు. మిగిలిపోయిన భోజనాలు మరోపూట ఇవ్వడంతో విద్యార్థులు అనారోగ్య బారిన పడుతున్నారన్నారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు వసతి గృహాలను పర్యటించి, విద్యార్థులకు అందిస్తున్న భోజనం, అక్కడి పరిసరాల పరిస్థితి వంటి పరిశీలించి, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఇటువంటి సంఘటనలు పునరావృతం అవుతాయన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని బాలరాజు డిమాండ్ చేశారు.

## సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి


నిరసన చేస్తున్న ఏపీటీఎఫ్, సీపీఎస్ నాయకులు

**పాడేరు:** సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఏపీటీఎఫ్, సీపీఎస్ ఎంప్లాయిస్ నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగానినాదాలు చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.అశోక్‌కుమార్ మాట్లాడుతూ జీపీఎస్, యూపీఎస్, సీపీఎస్ కాకుండా ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. 117 జీవోను రద్దు చేసి ఉపాధ్యాయులకు పాద పద్ధతిలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో పనిచేస్తున్న మైదాన ప్రాంత ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాలకు పంపించేలా చూడాలన్నారు. ఖాళీ పోస్టులను గిరిజన యువతతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు వెంకటపతిరాజు, సత్యనారాయణ, ధనుర్జాయ్, శ్యామ్ సుందర్, స్వామి, చిన్నారావు, శశికుమార్, రామారావు, శాంతికుమారి, గంగరాజు, మురళి పాల్గొన్నారు.

## వాగులు దాటే ప్రయత్నం చేయొద్దు


పణుకురాతిపాలెం వద్ద కన్నేరు వాగు ఉధృతిని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం


కొమరవరంలోని వాగును పరిశీలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర, సచివాలయ కార్యదర్శి భార్గవ్

**అడ్డతీగల/వై.రామవరం:** భారీ వర్షాలు కారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను ఎవరూ ఒక్కరూ దాటవద్దని ఐటీడీఏ పీఓ కట్టా సింహాచలం అన్నారు. మండలంలోని పణుకురాతిపాలెం వద్ద కన్నేరు వాగును ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో సింహాచలం మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఏజెన్సీలోని అన్ని ప్రాంతాల్లో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయన్నారు. వాగులు ప్రవాహం తగ్గే వరకూ ఎట్టి పరిస్థితుల్లో వాటిని దాటడానికి ప్రయత్నించొద్దన్నారు.కాలువలు దాటే ప్రాంతాల వద్ద ప్రభుత్వ సిబ్బందిని పర్యవేక్షణకు నియమించడం జరిగిందన్నారు. ఆయన వెంట అడ్డతీగల సీఐ నరసింహమూర్తి, ఎస్‌ఐ అప్పలరాజు, ఎంపీడీవో రంగారావు, తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచారి తదితరులున్నారు. వై.రామవరం మండలంలో పలు వాగులను ఎంపీడీవో కె.బాపన్నదొర పరిశీలించారు.

**అప్రమత్తంగా ఉండాలి**

**రాజవొమ్మంగి:** భారీ వర్షాలకారణంగా వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని , వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి ప్రజలను కోరారు. చాలా చోట్ల రహదారులు ఛిద్రమైన నేపథ్యంలో ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోరారు. ఇళ్ల వద్దనే ఉండాలని ప్రజలకు సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, రోగులకు తక్షణ వైద్యం అందించాలని కోరారు.



